# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన అంశాలపై చర్చించేందుకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హైదరాబాద్‌లో ఈ రోజు సమావేశం అవుతారు.**

**3. హైదరాబాద్‌లో జరిగే ఆషాఢమాస బోనాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రకటించింది.**

**4. ప్రజలకు సత్వర న్యాయం అందించడమే నూతన నేర చట్టాల లక్ష్యమని విజయవాడ నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ అదిరాజ్ సింగ్ రాణా అన్నారు.**

**5. ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసులు మంగళంపల్లి బాల మురళీకృష్ణ జయంతి ఈరోజు.**

**6. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రాగల మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.**

==========================

ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఢిల్లీ పర్యటన ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి గత రాత్రి ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ, 'దక్షిణ భారతదేశంలో మరే రాష్ట్రానికీ లేనన్ని వనరులు ఆంధ్రప్రదేశ్‌కు ఉన్నాయన్నారు. రాష్ట్రం గుండా కృష్ణా, గోదావరి నదులు ప్రవహిస్తాయని గోదావరిలోనే మిగులు జలాలు ఉన్నాయని తెలిపారు. అమరావతిలో 135 ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, రహదారులు, వంతెనల్లాంటి ముఖ్యమైన మౌలికవసతుల నిర్మాణాన్ని పూర్తిచేస్తామన్నారు. శాసనసభ, హైకోర్టు, సచివాలయ నిర్మాణాలనూ సాధ్యమైనంత త్వరగా పూర్తిచేస్తామని చెప్పారు. రాష్ట్రంలో నైపుణ్యగణన చేపట్టబోతున్నామని, తద్వారా ప్రజలకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి హామీలను కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ పునర్విభజనలో అపరిష్కృతంగా ఉన్న ఆస్తుల విభజన, బకాయిల చెల్లింపు అంశాలపై చర్చించేందుకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కానున్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లోఈ రోజు సాయంత్రం తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

సమావేశం కానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పూర్తిచేసింది. ప్రధానంగా షెడ్యూలు-9, షెడ్యూలు-10లలో ఉన్న సంస్థల విభజన, విద్యుత్తు సంస్థలకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య బకాయిలపై చర్చించనున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విభజన అంశాలపై చర్చిద్దామంటూ తెలంగాణ ముఖ్యమంత్రికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన రేవంత్ రెడ్డి జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించే చర్చల్లో పాల్గొనాల్సిందిగా చంద్రబాబును ఆహ్వానించారు.

---------------------------

హైద్రాబాద్‌లో జరిగే ఆషాఢమాస బోనాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ -టిజిఎస్ ఆర్టీసీ ప్రకటించింది. జులై 7న జరగనున్న గోల్కొండ బోనాల జాతర కోసం హైదరాబాద్ మహా నగర పరిధిలోని ప్రధాన ప్రాంతాల నుంచి గోల్కొండ కోటకు 75 ప్రత్యేక సిటీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు హైద్రాబాద్ జోన్ ఈడీ వేంకటేశ్వర్లు వెల్లడించారు. సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లు, కూకట్‌పల్లి, కేపీహెచ్బి, పఠాన్ చెరువు, రాజేంద్రనగర్, హయత్ నగర్, దిల్‌షుక్నగర్, మెహదీపట్నం, రాంనగర్, చార్మినార్, ఉప్పల్, మల్కాజ్‌గిరి వంటి ప్రధాన మార్గాలనుంచి గోల్కొండకోటకు బస్సులు నడుస్తాయని తెలిపారు.

---------------------------

ప్రజలకు సత్వర న్యాయం అందించడమే నూతన నేర చట్టాల లక్ష్యమని విజయవాడ నగర డిప్యూటీ పోలీస్ కమిషనర్ అదిరాజ్ సింగ్ రాణా అన్నారు.

ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం అధ్యర్యంలో విజయవాడలో నిన్న నూతన నేర న్యాయ చట్టాలపై అవగాహన కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ నుంచి సహాయ సంచాలకులు బి.రామకోటేశ్వరరావు, ఆకాశవాణి విజయవాడ కేంద్రం డైరక్టర్ ఎం.సోమేశ్వరరావు, ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం డైరక్టర్ శ్రీ సాయి వెంపటి పాల్గొన్నారు. ఈ సందర్భం గా నూతన నేర చట్టాలపై విజయవాడ పత్రికా సమాచార కార్యాలయం- పిఐబి రూపొందించిన సంక్షిప్త సమాచార ప్రత్యేక సంచికను డీసీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా అదిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ, మారుతున్న కాలంతో పాటు చట్టాలలో మార్పులు తీసుకురావడం వల్ల ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. కొత్త చట్టాల్లో ప్రభుత్వం మహిళలు, చిన్నారులపై నేరాలకు ప్రాధాన్యం ఇచ్చిందని పేర్కొంటూ,

వాయిస్ (26 సెకన్లు)

ఆంధ్రప్రదేశ్ డైరక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సహాయ సంచాలకులు బి.రామకోటేశ్వరరావు పాత్రికేయులకు విషయాల పట్ల సరైన అవగాహన ఉంటే వారు ప్రజలకు మరింత మెరుగ్గా తెలియజేయడానికి అవకాశం ఉంటుందన్నారు. నూతన చట్టాల పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించే బాధ్యత పాత్రికేయులపైనే ఉందని తెలుపుతూ..

వాయిస్ (21 సెకన్లు)

---------------------------

ఈరోజు ప్రపంచ జునోసిస్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. జంతువులు ప్రత్యేకించి పెంపుడు జంతువుల నుండి మానవులకు వ్యాపించే వ్యాధులు, వాటి నివారణ పట్ల అవగాహన కల్పించడం కోసం ఈ కార్యక్రమం

జరుగుతోంది. లూయీ పాశ్చర్ అనే ఫ్రెంచ్ జీవ శాస్త్రవేత్త శునకాల నుండి రేబిస్ వ్యాధి వస్తుందని గుర్తించి... ఆ వ్యాధిని అరికట్టడానికి 1886వ సంవత్సరం జులై 6వ తేదీన టీకా కనుగొన్నారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని జూలై 6వ తేదీని జునోసిస్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. జునోసిస్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పెంపుడు జంతువుల విషయంలో శుచి, శుభ్రత పాటించడం చాలా అవసరం. జూనోసిస్ డే ని పురస్కరించుకొని ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది

---------------------------

ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసులు, పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ జయంతి ఈరోజు. తెలుగు సంగీత ప్రపంచంలో మేరునగధీర సమానులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ 1930 జూలై 6న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రాజోలు శంకరగుప్తంలో జన్మించారు. కర్ణాటక సంగీతంలో తనకు తానే సాటి అనిపించుకున్న బాలమురళీకృష్ణ సొంతగా కొన్ని రాగాలను ఆవిష్కరించారు. ప్రపంచ వ్యాప్తంగా 26 వేల సంగీత కచేరీలను నిర్వహించిన ఘనత బాల మురళీకృష్ణకు దక్కింది. ఆకాశవాణిలో నిలయ విద్వాంసులుగా చిరకాలం ఆయన సేవలు అందించారు. భక్త రామదాసు కీర్తనల ప్రచారానికి విశేష కృషి చేశారు. తన గానమాధుర్యంతో అలరించిన మంగళంపల్లి బాలమురళీకృష్ణ 2016 నవంబర్ 22న తుదిశ్వాస విడిచారు. ఆ బాలగోపాలాన్ని అలరించిన బాలమురళి గళాన్ని ఒకసారి విందాం.

..వాయిస్.. 27 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలిలో శాసనసభ్యుల కోటా శాసన మండలి సభ్యులు-ఎమ్మెల్సీలుగా తెలుగుదేశం పార్టీ తరపున సి.రామచంద్రయ్య, జనసేన పార్టీ నుంచి పి.హరి ప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి యం.విజయరాజు ప్రకటించారు. ఎంఎల్ఏల కోటా కింద రాష్ట్ర శాసన మండలిలో ఖాళీ అయిన 2 ఎంఎల్సీ స్థానాల భర్తీకి నామినేషన్ల ఉప సంహరణ గడువు నిన్నటితో ముగియడంతో కేవలం ఇద్దరు అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో సి.రామచంద్రయ్య, పి.హరిప్రసాద్ లు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారని తెలిపారు.

---------------------------

తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణం కేంద్రం తెలిపింది. ఉత్తర కోస్తాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని, అలాగే రాయలసీమ, దక్షిణ కోస్తాలో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశముందని పేర్కొంది.

తెలంగాణలో ఈ రోజు, రేపు అక్కడక్కడ ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని సూచించింది. కాగా నిన్న తెలంగాణ వ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురిశాయి. అత్యధికంగా వనపర్తి జిల్లా పెబ్బేరులో 6.7 సెం.మీటర్ల, నారాయణపేట

జిల్లా ధన్వాడలో 4.1, ములుగు జిల్లా వాజేడులో 3.3 సెం.మీటర్ల వర్షపాతం నమోదయిందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

---------------------------

పర్యాటకులను ఆకర్షించే విధంగా తెలంగాణ పరిధిలోని నల్లమల అడవులను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అచ్చంపేటలో నల్లమల పర్యాటక ప్రాంతాలను గుర్తించేందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి ఆయా ప్రాంతాలను పరిశీలించారు.

=======================